# పచ్చగడ్డి మంటలు – పసిబిడ్డ నవ్వులు

— 'మిర్రర్'

**రాజుకు** ఒళ్ళు మండిపోతూంది.

సునందకు ఇంకా ఎక్కువగా మండిపోతూంది.

వాళ్ళిద్దరి మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గున మండిపోయేలా ఉంది.

కానీ, పచ్చగడ్డి వేసి పరీక్ష చేయ దలచుకున్న వారికి నిరాశే ఎదురవుతుంది. కారణం వారిద్దరికి మధ్య పచ్చగడ్డి పెట్టేటంత సందుకూడా లేదు.

అలా ఒకరిమీద ఒకరికి ఒళ్ళు మండిపోయే టంతటి పరిస్థితులు ఎందుకు వచ్చాయంటే—

అదొక పెద్ద కథ.

రాజు సునంద మెడలో తాళి కట్టి ఆరు నెలల క్రిందట ఒక అందమైన పౌర్ణమిలో, ఆనందంగా కాపురం పెట్టాడు.

కాపురం పెట్టిన రెండు నెలల వరకు ఏమీ అర్థం కాలేదు.

అంత బిజీ.

ఆ తరవాత ఒకరి నొకరు అర్థం చేసుకోవాలని ప్రయత్నం చేయసాగారు. అయితే అలా ఒకరి గురించి ఒకరికి అర్థం అవుతున్న కొలదీ, ఒకరిమీద మరొకరికి ఒళ్ళు మండిపోయేటంత కోపం ముంచుకు రాసాగింది.

రాజు నిజంగానే రాజులా — యువరాజులా — ఉంటాడు. అతని అలవాట్లు, అభిరుచులు కూడా రాయల్‌గా ఉంటాయి. అంతా బాగానే ఉంది కానీ, రాజుకు తన వ్యక్తిత్వం పట్ల తనకే గర్వం.

రాజు గ్రాడ్యుయేటు. యూనివర్సిటీ ఫస్టు. అందుకే ఫస్టు క్లాస్ బాంక్ ఉద్యోగం దొరికింది. జీవితంలో తృప్తి. ఎంతో హోదా. అంతా హాయి. బోలెడంత ఆనందం.

అన్నీ ఉన్న ఆ యువరాజు, సునందను పెళ్ళి చూపులు చూసిన రోజున ఆమె అందం చూసి తనను తాను మరిచిపోయాడు. మరొక ఆలోచన చెయ్యకుండా ఓకే అన్నాడు.

అంతా సవ్యంగా జరిగింది.

అంతా సరిగానే ఉన్నట్లనిపించింది.

కానీ, క్రమంగా తను ఎక్కడ పొరపడ్డాడో తెలియసాగింది.

పెళ్ళిచూపుల నాడు సునంద అందచందాలు చూసి 'ఆహా!' అనుకున్నాడు. ఆమె కూడా గ్రాడ్యుయేట్ అని తెలిసి 'ఓహో!' అనుకున్నాడు. కానీ, తరవాత తను 'అయ్యో!' అనుకోవలసి వస్తుందని అప్పుడు అనిపించలేదు.

రాజుకు ఇంగ్లీషు భాష మీద మహా మోజు.

ఇంగ్లీషు సినిమాలు అతనికి ప్రాణం.

ఇంగ్లీషు నవలలు అతనికి ఆరవ ప్రాణం.

ఇంగ్లీషులో మాట్లాడటం అతని హాబీ.

అయితే సునంద ఈ విషయంలో రాజుకు పూర్తిగా భిన్నం.

సునందకు ఇంగ్లీషు భాష మీద అయిష్టం లేక పోయినా, ఆసక్తి మాత్రం లేదు. ఆమె అచ్చు పదహారణాల తెలుగు కన్య. ఆవిడవి అన్నీ తెలుగు పద్ధతులు.

అతను ఇంగ్లీషు మాగజైన్ చదువుతూంటే, ఆమె తెలుగు వార పత్రిక చేతిలోకి తీసుకుంటుంది.

అతను ఇంగ్లీషు సినిమా ప్రపోజు చేస్తే, ఆమె తెలుగు పిక్చరుకు దారి తీస్తుంది.

ఆ రోజు —

సమయం రాత్రి తొమ్మిది దాటింది.

భోజనాలు అయిపోయిన తరవాత —

సందిరి (తేని) మంచం మీద శయనించారు.

అతను పెర్రీ మేసన్ ఇంగ్లీషు నవల చేతిలోకి తీసుకున్నాడు.

ఆమె దిండు క్రింద నుంచి తెలుగు నవల బయటికి తీసింది.

అతని అభిమాన రచయిత గార్డనర్.

ఆమె అభిమాన రచయిత్రి సంగిపూడి త్రిలోచనాదేవి.

కొద్ది సేపటికే ఇద్దరూ తమ తమ నవలల్లో లీనమై పోయారు.

అతను చదువుతున్న నవలలో—

ఒక హత్య జరిగింది. లాయర్ పెర్రీ మేసన్ పరిశోధన మొదలు పెడతాడు. ఎంతకూ క్లూ దొరకదు. చివరికి ఏమవుతుందా అనే ఆరాటం పెరిగి పోయి, హంతకుడు ఎవరు అయి ఉండవచ్చో అంచనా వేసుకుంటాడు రాజు. రాజు, సునంద అభిప్రాయం కోసం ఆమె వంక చూస్తే—

ఆమె నవలలో పూర్తిగా లీనమైపోయి ఉంది.

ఆమె నవలలో—

విదేశాలలో చదువు తున్న తన బావ ఎప్పుడు తిరిగి వస్తాడా అని నాయిక ఎదురు చూస్తుంది. చివరికి బావ వస్తాడు. కానీ తనతోకూడా ఒక విదేశీ యువతిని తెస్తాడు. చివరికి అతను ఎవరిని పెళ్ళి చేసుకుంటాడు అన్నది ఒక పెద్ద సమస్య అయి పోయింది. ఇంతవరకు తను చదివిన దాన్ని దృష్టిలో ఉంచుకుని, సునంద ఒక అంచనా వేసుకుంటుంది. అయితే ఈ విషయంలో రాజు అభిప్రాయం ఏమిటో తెలుసుకుందామని అతని వైపు తిరుగుతుంది.

ఇద్దరి చూపులూ ఏకం అయిన తరవాత—

ఎవరి నవల గురించిన కథనం వారు చెప్పటం మొదలుపెట్టారు.

ముందు తను చెప్పేది వినమని ఎవరికి వారు పట్టుబట్టడం, చివరికి సునంద తన పంతం నెగ్గించుకోవటం జరిగింది.

రాజు సహనంగా ఆమె చెప్పేంది వినసాగాడు.

కానీ, సునంద అతని సహనానికి పరీక్ష పెట్ట సాగింది.

కథాంశాన్ని మూడు ముక్కల్లో చెప్పకుండా రచయిత్రి కంటే ఎక్కువగా విపులీకరిస్తూ పోయే సరికి రాజుకు సహనం చచ్చిపోయింది. వెంటనే కోపం పుట్టుకు వచ్చింది.

ఆ కోపంలో —

అసలు తెలుగు నవలలో కథా బలం ఉండదన్నాడు. కథాగమనం అసహజంగా ఉంటుం దన్నాడు. ఎలా ఉన్నా చదివే తెలుగు పాఠకులకు బుర్ర లేదన్నాడు. ఇంకా ఎన్నో అన్నాడు. అన్నీ అని చివరికి—

ఇంగ్లీషు నవలలు చదివితే విజ్ఞానం పెరుగుతుం దన్నాడు. సాహిత్యం ఎంత గొప్పదో తెలుస్తుం దన్నాడు. కావాలంటే — తన వద్ద ఉన్న పెర్రీ మేసన్ నవల చదవ మన్నాడు.

ఎన్ని అన్నా సునందకు బాధ కలగలేదు.

కానీ, తన అభిమాన రచయిత్రిని తక్కువగా అంచనా వేసినందుకు సునంద చాలా బాధపడింది.

ఇలా ఆయన తనను కించ పరచటం ఇది మొదటి సారి కాదు. ప్రతిసారీ తను ఎంత సర్దుకుపోతున్నా ఆయన ధోరణి మరీ పెరిగిపోతూంది. దీనికి ఏదైనా శాశ్వతమైన పరిష్కారం ఆలోచించాలి. అంతే కానీ, ప్రతిసారీ ఇలా తను సర్దుకు పోతూంటే తనకు వ్యక్తిత్వం అంటూ ఏదీ మిగిలేలా లేదు అనుకుంది.

ఇన్ని మాటలు అనుకున్న తరవాత రాజుకు తన నవల గురించి చెప్పే మూడ్ చెడిపోయింది. ఇలా ఆమె తన మూడ్ చెడగొట్టడం ఇది మొదటిసారి కాదు. గతంలో ఆమె ఎన్నిసార్లు తనతో వాగ్వివాదం పెట్టుకోలేదు? అయితే ప్రతిసారీ తను సహనంగా సర్దుకు పోతున్నాడు. కానీ, ఇలా ఎన్నాళ్ళు? తన ఆశయాలు, అభిరుచులు తెలుసుకుని, తనను గుర్తించని భార్యతో ఎవరుమాత్రం ఎంతకాలం 'కాపురం



చేయగలుగుతారు? ఏది ఏమైనా, ఈ విషయంలో తను ఒక నిర్ణయానికి త్వరలో రావటం మంచిదను కున్నాడు రాజు.

ఆ మరునాడు —

ఆదివారం.

రాజు మహారాజులా ఆలస్యంగా నిద్ర లేచాడు.

సునంద ఎప్పటిలా తన పక్కను నిద్రపోవటం లేదు.

అప్పటికే లేచి ఆమె వంట ఇంటి ప్రవేశం చేసింది.

సునందకు కోపం వచ్చిన రోజున రాజు కంటే ముందే నిద్రలేచి, వంట ఇంటికి— వంట పేరుతో అంటుకు పోతుంది.

ఆ విషయం అర్థం చేసుకుని రాజు ఆమెను ప్రతిసారి ప్రసన్నం చేసుకుంటాడు.

కానీ, ఈ సారి మాత్రం తను అలా చేసి ఆమె దృష్టిలో ఇంకా పలుచనై పో దలచుకోలేదు.

మరొక గంట తరవాత ఆమె టేబులుపై టిఫిను సిద్ధంచేసింది.

అతను మౌనంగా వచ్చి కూర్చున్నాడు.

ఆమె గిన్నెల మీద మూతలు తీసింది.

అతను గిన్నెలోకి చూశాడు.

ఆమె వేడి వేడి ఇడ్లీలు తీసి అతని పళ్ళెంలో వడ్డించింది.

అతనికి ఇడ్లీలు చూడగానే ఒళ్ళు వేడెక్కి పోయింది.

తనకు ఇడ్లీ అంటే ఇష్టం ఉండదు. ఇంగ్లీషు నవలల్లో పెర్రీమాసన్ లా బ్రేక్‌ఫాస్ట్‌లో శాండ్ విచెస్ తినాలని ఉంటుంది. ఆ మధ్య, అవి ఎలా తయారు చెయ్యాలో తెలియజెప్పే పుస్తకం ఒకటి తెచ్చి సునందకు ఇచ్చాడు. ఆమె ఆ పుస్తకం చదివి వాటిని తయారు చెయ్యటం నేర్చుకోలేదు సరికదా దాని గురించి ప్రస్తావించటం మానేసి, ఇంకా ఇడ్లీలే వండి పెడుతూంది. దానితో రాజుకు ఒళ్ళు వేడెక్కిపోయింది.

వేడెక్కిన తన శరీరాన్ని వడివడిగా అవతలి గదిలోకి చేరవేశాడు రాజు.

అయితే అతని ధోరణే కూడా ఆమెకు మరింత విసుగు తెప్పించింది.

రాత్రి తను ఎంతో సహజంగా ఉన్నా అతను అకారణంగా రెచ్చిపోయాడు. అతనికి కోపం వచ్చిన విషయం తెలిసిపోతుంది. ఆ కోపం చల్లారాలని తను కమ్మనిది వేడివేడి ఇడ్లీలు వండి పెడితే, ఎంత మొరటు..! ఎంత నిర్లక్ష్యం!

అదే తను రాత్రి చదివిన మంచిన పూడి త్రిలో చనా రాణి నవలలో—

నాయిక ఇడ్లీలు వండి పెడితే —

విదేశాల నుంచి వచ్చిన నాయకుడు ఎంతో ప్రేమగా తింటాడు. నాయికను ఎంతో మెచ్చు కుంటాడు. అంతటి ఫారిన్ రిటర్న్డ్ హీరోను మెచ్చిన ఇడ్లీ, తన భర్తకు నచ్చక పోవటంలో ఏదో లోపం ఉంది.

అది ఇడ్లీలో కాదు.

అది అతనిలోనే ఉంది.

అతనికి తనపై ఎలాంటి ప్రేమా లేదు.

ఇంతచదువు చదివి, ఇంత కట్నం ఇచ్చి, అతనికి భార్యగా వచ్చి, ఇంత సేవ చేస్తూంటే అతను తనకు ఇచ్చే ప్రతిఫలం ఏమిటి?

తిరస్కారం!

నిరసన!

నిరాదరణ!

తనుమాత్రం ఎన్ని సర్దుకు పోవటం లేదూ?

అతని హెయిర్ స్టైల్ తనకు నచ్చదు.

అతని లూజు షర్టులు తనకు అసహ్యం.

అతను అరగంట సేపు నానుస్తూ భోజనం చేయటం తనకు బాగుండదు.

అయినా, అతని అభిరుచులను కాదనటం ఎందుకని తను సర్దుకుపోతూంది. కానీ, ఇకపై తనవల్ల కాదు.

సాయంకాలం బండిలో ప్రయాణం అయి పుట్టింటికి వెళ్ళిపోయి, నెమ్మదిగా విడాకులు పుచ్చుకోవాలి. అతనితో కాపురం తన వల్ల కాదు— అనుకుంది.

ఆ నిర్ణయం తీసుకున్న తర్వాత కొంత రిలీఫ్ కలిగింది. తరవాత నెమ్మదిగా టిఫిను తినసాగింది.

రాజా కూడా వేడివేడిగా ఆలోచించి కొన్ని క్విక్ డెసిషన్స్ తీసుకున్నాడు.

సునందతో తను ఇన్నాళ్ళూ ఎలాగో సర్దుకుపోయాడు. కానీ, ఇకపై తన వల్ల కాదు.

ఆమె పెద్దగా మాట్లాడే తీరు తనకు నచ్చదు.

ఆమె వండే వంటలు, రుచులు తనకు రుచించవు.

ఆమె ఆలస్యంగా నిద్రలేవటం తనకు చిరాకు.

అయినా అన్నీ భరిస్తున్నాడు.

కానీ, ఇకపై భరించలేడు.

ఆమెను సాయంకాలం బండిలో పుట్టింటికి పంపి నెమ్మదిగా విడాకులు తీసుకోవటం మంచిది.

ఈ నిర్ణయం తీసుకున్న తరవాత కొంత రిలీఫ్ కలిగింది.

కానీ, అంతలో —

అవతలి గదిలోంచి వింత శబ్దాలు వినపడసాగాయి.

సునంద డైనింగ్ టేబులు ముందు కూర్చుని ఉంది.

డోకు వస్తూంటే బలవంతాన ఆపుకుంటూంది.

రాజా వెంటనే బట్టలు మార్చుకుని ఆమెను డాక్టరు దగ్గరికి తీసుకు వెళ్ళాడు.

ఇది జరిగి రెండు సంవత్సరాలు అయింది.

ఇప్పుడు బాబిగాడు ఏడ్చినప్పుడు, వాడు ఆడుకోవటం కోసం —

సునంద పెర్రీమాసన్ నవల తెచ్చి ఇస్తుంది.

రాజా అల్మైరా లోంచి తీసి మంగిపూడి త్రిలోచనా రాణి నవల బాబిగాడి ముందు పెడతాడు.

బాబిగాడు ఇటూ అటూ తిప్పి రెండు నవలల నుంచి ఒక్కో కాగితం చింపుతూం టాడు.

బాబిగాడు పుస్తకాలు చింపుతున్నాడన్న ధ్యాస వీళ్ళకు ఉండదు.

వాడు ముద్దు ముద్దుగా నవ్వుతూంటే సునంద, రాజా — ఇద్దరూ కలిసి వాడితోబాటు నవ్వుతూంటారు. *

